క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడులో ఇటీవల మృతిచెందిన శ్రీకృష్ణుడి దేవాలయ అర్చకుడు కొదమసింహం సువర్ణ ప్రసాదాచార్యులు కుటుంబానికి ఏపీ ప్రైవేట్ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ద్వారా మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ప్రసాదాచార్యులు భార్య కల్యాణికి దాతల సహకారంతో సేకరించిన రూ.28,600 నగదు, ఏడు టిక్కీల బియ్యం, దుస్తులను అందజేశారు. రాష్ట్ర పైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ రాజు, సంఘ సభ్యులు రాము, జక్కేపల్లి ప్రసాద్, కుమార్, శ్రీనివాసశర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో తేనెమంచు పురుగు



తిరువూరు: పూత, పిందె దశలో ఉన్న మామిడిలో తేనె మంచు పురుగు, తామర పురుగు ఆశించిందని ఉద్యానవన అధికారి సోహైల్ అహ్మద్ అన్నారు. లక్ష్మీపురంలో తెగుళ్లు ఆశించిన మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తామర పురుగులు పిందె ఏర్పడే దశలో తోలుపై గోకి రసాన్ని పీలుస్తాయని, దీనివల్ల పిందెలు రాలిపోయి, రాతి మంగు ఏర్పడి కాయ నాణ్యత దెబ్బతింటుందని చెప్పారు. వీటి నివారణకు ఫిప్రినిల్ 80 శాతం, 0.4 గ్రాములు లేదా స్పినిటోరం ఒక మిల్లీ లీటరును లీటరు నీటికి వేప నూనె కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

కబడ్డీలో విద్యార్థినుల ప్రతిభ



నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారని హైస్కూల్ హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ మంగళవారం విలేకరులకు తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో మచిలీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో పీడీలు కె.రాణి, ఉపాసి సరళ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలోని దాసాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వ్యాపార ప్రముఖులు నాళ్ళా సాయిప్రసాద్ మంగళవారం రూ.లక్షా 1,116 విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు కూరపాటి గోపాల్, ఇన్‌చార్జి నర్సింగ్ లక్ష్మణ్‌లకు ఈ నగదు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మునుసూరు: రోగులకు ఆరోగ్య, ఆర్థిక భరోసానిచ్చే విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పడుతుందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. మండలంలోని గుడిపాడు, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెంలలో వివిధ రుగ్మతలకు చికిత్సలు పొంది కోలుకుంటున్న ముగ్గురికి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం సాయంత్రం ఆయన రూ.1.46 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గద్దె రఘు, మందలపు ధర్మరాజు, గణేష్, బుజ్జి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28వ తేదీలోగా ఏదైనా సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూజివీడు శాఖ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్స్‌ను నెట్ సెంటర్ ద్వారా, జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. జనవరి ఒకటి కంటే ముందు సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్స్ పనిచేయవని, ఎవరైనా లేవలేని వారు ఉంటే సంఘ కార్యదర్శి దృష్టికి తీసుకువస్తే ఇంటి వద్ద నుంచే లైఫ్ సర్టిఫికెట్లను అందజేసే ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరమైన వారు సెల్: 94402 27329 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వరి గడ్డి నిల్వలో బొద్దులకు ప్రాధాన్యం

- వరి గడ్డి నిల్వలో పాత పద్ధతులకు స్వస్తి
- ఒక బొద్దు గడ్డికి రూ.50 వెచ్చిస్తున్న రైతులు
- పొలంలేని పాడి రైతులకు భారంగా మారిన వరి గడ్డి





చిన్న నందిగామ గ్రామ శివారులో ప్రత్యేక యంత్రంతో వరిగడ్డిని బొద్దులు కడుతున్న యంత్రం ; వరి గడ్డి బొద్దులను ట్రాక్టరులో ఇంటికి తరలిస్తున్న రైతులు

జి.కొండూరు: పశువుల మేతలో ప్రధానమైన వరి గడ్డి నిల్వలో రైతులు పాత పద్ధతులకు పూర్తిగా స్వస్తి పలికారు. సాగులో ఆధునిక పద్ధతుల వైపు పరుగులు పెడుతున్న రైతులు, వరి గడ్డి నిల్వలో కూడా యాంత్రిక పద్ధతికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో సంప్రదాయ పద్ధతిలో వరి పండించి, గడ్డి నుంచి ధాన్యం వేరు చేయడం, గడ్డి కట్టలు కట్టి ఇంటికి తరలించడం, వాములుగా వేయడం వరకు కూలీలే చేసేవారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా యాంత్రిక పద్ధతిలోకి మారిన రైతులు, నేడు వరి కోయడంతోనే గడ్డి, ధాన్యం వేరు చేసే యంత్రాలను వినియోగిస్తున్నారు. గడ్డిని తరలించేందుకు కూలీల కొరత ఏర్పడుతుండటంతో యంత్రం ద్వారానే బొద్దులుగా చేయించి తరలిస్తున్నారు. ఈ పద్ధతిలో గడ్డి వృథాను తగ్గించడంతో పాటు తక్కువ మంది కూలీలతో అతి తక్కువ సమయంలో వరి గడ్డి ఇంటికి చేరుతోంది. అయితే పొలం లేని పాడి రైతులకు మాత్రం వరిగడ్డి కొనుగోలు భారంగా మారింది.

బొద్దుకు రూ.50 వరకు ఖర్చు

వరి కోత పూర్తయిన వారం రోజుల తర్వాత గడ్డి ఆరిన అనంతరం ప్రత్యేక యంత్రం సాయంతో గడ్డిని బొద్దులుగా చేయిస్తారు. ఈ విధంగా వరి గడ్డిని బొద్దుగా చేసినందుకు యంత్రానికి రూ.25, ఈ గడ్డిని ఇంటికి తరలించినందుకు ట్రాక్టరు, కూలీలకు కలిపి రూ.25 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఈ విధంగా ఎకరంలో వరి గడ్డి 70 నుంచి 100 బొద్దుల వరకు తయారవుతుంది. దీని వల్ల బొద్దు వరి గడ్డి ఇంటికి చేరే వరకు రూ.50 చొప్పున ఎకరానికి రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు రైతులకు ఖర్చు అవుతోంది. ఈ ధరలు ప్రాంతాల వారీగా దూరాన్ని బట్టి మారుతుంటాయి.

పొలం లేని పాడి రైతులకు భారం

మైలవరం నియోజకవర్గంలో పొలం లేని పాడి రైతులతో పాటు ఇటీవల వచ్చిన వరదలకు వరి పైరు నష్టపోయిన రైతులకు వరి గడ్డి కొనుగోలు, తరలింపు భారంగా మారింది. మైలవరం నియోజకవర్గంలో ఈ ఏడాది 14,989 హెక్టార్లలో వరి సాగవ్వగా ఇటీవల వచ్చిన వరదలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదలకు నష్టపోయిన రైతులతో పాటు పొలంలేని పాడి రైతులకు వరి గడ్డి భారంగా మారింది. గడ్డి కొనుగోలు నుంచి ఇంటికి తరలించే వరకు ఎకరంలో గడ్డికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతోంది. నియోజకవర్గంలో అవులు, గేదెలు కలిపి 78,886 వరకు పశు సంపద ఉంది.

కూలీల కొరత తప్పింది



వరి గడ్డిని బొద్దులు కట్టించడం వల్ల కూలీల కొరత తప్పింది. గతంలో లూజు వరి గడ్డిని ఇంటికి తరలించాలంటే కూలీలు వచ్చేవారు కాదు. ఇలా బొద్దులు కట్టించడం వల్ల ఖర్చు కొంచెం ఎక్కువైనా సమయం కలిసి వస్తోంది. వాములు వేయడం కూడా సులభంగా మారింది. గడ్డి కొనుగోలు చేసే రైతులకు కొంత భారంగా ఉంది.

– వేముల వెంకటేశ్వరరావు, రైతు, వెల్వదం గ్రామం

వరి గడ్డి కొనుగోలు భారం



పశువుల మేత కోసం వరి గడ్డి రేట్లు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. మిషన్‌తో కోసి వరి గడ్డి బొద్దులు కట్టించి ఇంటికి చేరే వరకు ఎకరంలో గడ్డికి రూ.10 వేల వరకు ఖర్చు అవుతోంది. అదే సంప్రదాయ పద్ధతిలో కోసి నూర్పిడి చేసిన వరి గడ్డి అయితే ఎకరంలో గడ్డిని రూ.15 వేల వరకు చెబుతున్నారు. గతంలో పది నుంచి పదిహేను ఎకరాలలో గడ్డి కొనుగోలు చేసేవాళ్లం. ఈ ఏడాది రేట్లు పెరగడంతో ఐదు ఎకరాలలో వరి గడ్డి మాత్రమే కొనుగోలు చేశా.

– రంజిత్‌కుమార్, పాడి రైతు, జి.కొండూరు

హెల్మెట్ ధారణ తప్పనిసరి



తిరువూరు: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు అన్నారు. తిరువూరు సమీపంలోని లక్ష్మీపురం జంక్షన్‌లో మంగళవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతి వేగం వద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సీఐ సూచించారు. వాహన చోదకులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఎస్ఐ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి

తిరువూరు: అన్ని దుకాణాల్లో సీసీ కెమేరాలు విధిగా ఏర్పాటు చేయాలని సహాయ పోలీస్ కమిషనర్ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని, వీటిని దుకాణదారులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎస్ఐ సత్యనారాయణ, తిరువూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఆర్యవైశ్య సమాజం అధ్యక్షుడు గుడిమెట్ల మురళి పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా అందని సాయం

- పంచాయతీ కార్యాలయం వద్ద బాధితుల నిరసన
- రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధితులు

మైలవరం: రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. తొమ్మిదేళ్లుగా సాయం కోసం ఎదురుచూస్తున్నా ఫలితం లేదని, తక్షణమే తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. బాధితులు మాట్లాడుతూ మైలవరం మండలం వెల్వడం గ్రామంలో మైలవరం నుంచి వెల్వడం మీదుగా నూజివీడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి విస్తరణలో భాగంగా 2016లో వెల్వడం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల యజమానులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని చెప్పి ఇంటి ప్రహరీలు, రోడ్డు వైపు ఉన్న గదులను పగులగొట్టారని చెప్పారు. ఖాళీగా ఉన్న స్థలాలను కూడా స్వాధీనం చేసుకున్నారన్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు కూడా నష్ట పరిహారం చెల్లింపుపై హామీ ఇచ్చారు. కానీ నష్టపోయిన బాధితులకు నాటి టీడీపీ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించకుండా ముఖం చాటేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా బాధితులను పట్టించుకోవడం లేదని బాధితురాలు సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేసింది. సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ 2016లో నాటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 కోట్లతో ఈ రోడ్డు పనులు చేపట్టారన్నారు. రోడ్డు నిర్మాణం పనులు నాసిరకంగా చేపట్టడంతో గుంటలు మయంగా మారి, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

రింగ్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వాహనాల రాకపోకలతో 65వ నంబర్ జాతీయ రహదారిపై తలెత్తిన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగ ముందు విజయవాడ వైపు వచ్చిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పలువురు వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పోలీస్ అధికారులకు తలకుమించిన భారంగా మారింది. దీనిపై స్పందించిన కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్ వ్యాపారాలు, సర్వీస్ రోడ్డు, సినిమా థియేటర్లు, ఇతర షాపింగ్ మాల్స్ వద్ద ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. తద్వారా పండుగ సెలవులు ముగిసి హైదరాబాద్ వైపు వాహనదారులు తిరుగు ప్రయాణం చేసే సమయానికి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపారు. రింగ్ సెంటర్ సమీపంలో హైదరాబాద్ బస్‌స్టాప్ వద్ద ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నిలుపకుండా బస్‌స్టాప్‌లోనే ఆగేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐతో పాటు కానిస్టేబుల్స్ వాహనాల రాకపోకలకు అవాంతరాలు కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అధికారుల చర్యలతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గుముఖం పట్టింది. ఈ విధానం పండుగ మూణ్ణాళ్ల ముచ్చటగా కాకుండా దీర్ఘకాలంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ క్రాప్ నమోదుపై అవగాహన

విస్సన్నపేట: రబీ పంటలు సాగు చేసే రైతులు వాటి వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని విస్సన్నపేట మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నరసాపురంలో రైతులకు ఈక్రాప్ నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. వరి, అపరాలు, మొక్కజొన్న సాగు చేసే రైతులు రైతు సేవా కేంద్రంలో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

మిషన్ వాత్సల్యకు 64 మంది ఎంపిక

తిరువూరు: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నట్లు తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తిరువూరు ప్రాజెక్టు పరిధిలో 72 మంది ఈ పథకానికి దరఖాస్తు చేయగా 64 మందికి ఆర్థిక సాయం మంజూరైందని చెప్పారు. నెలకు రూ.4 వేల చొప్పున అర్హులైన బాలబాలికలకు ఈ నగదును కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటరత్నం

ఆగిరిపల్లి: మండల ఆర్య వైశ్య మండల అధ్యక్షుడిగా స్థానిక ఎస్‌మార్ట్ సూపర్ మార్కెట్ యజమాని చలవాది వెంకటరత్నాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్య వైశ్య మండల కార్యదర్శిగా మడుపల్లి శివరామమూర్తి, కోశాధికారిగా యండూరి శ్రీరామ్ సుధీర్ ఎన్నికయ్యారు. వీరిని ఆర్యవైశ్య సంఘ నాయకులు మడుపల్లి గోపాల్, టీవీఎస్ కిరణ్, తవ్వ మురళీధర్, యండూరు ప్రణీత్, జూలూరు కోటేశ్వరరావు అభినందించారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు ప్రారంభం

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు లక్ష్మీపురం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శిబిరం నిర్వహించారు. ఈనెల 22న ఆంజనేయపురం అంగన్‌వాడీ కేంద్రంలో, 23న కోకిలంపాడు, 24న మల్లేల, 27న చౌటపల్లి, 28, 29 తేదీల్లో అక్కపాలెం, 30న జీకొత్తూరు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు.

నేడు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

తిరువూరు: స్థానిక బైపాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయ 26వ వార్షికోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 5.30 గంటలకు ఫలరసాలు, పంచామృతాలతో విఘ్నేశ్వరుడికి అభిషేకం, విశేష పూజలు, 10 గంటలకు అన్నదానం జరుగుతుందని చెప్పారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

మైలవరం: మైలవరం మండలం వెల్వడం శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి రూ. 6,200 నగదు, 25 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పలువురు జూదరులు పారిపోయారు.

26న క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మేథ–2025 పేరుతో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్లు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఎస్పీ ఎస్ఆర్‌సీ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్విజ్ విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.3 వేలు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. వ్యాస రచన, 'కథ చెప్పుకుందాం' పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్న విజేతలకు వరుసగా రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ.1000 అందజేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 94903 36550 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ ఫీడర్‌తోపాటు 11 కేవీ దత్త రోడ్డు ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా బుధవారం ఉదయం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ పోస్టాఫీస్, హరి ఓం టింబర్ డిపో, మధుసూధన టింబర్ డిపో, ట్రిపుల్ ఎస్ కాలనీ, వస్త్రలత కాలనీ, రాయల్ ఒపెరా అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

పశువులకు వైద్య శిబిరాలతో మేలు

మునునూరు: పశువుల్లో సంభవించే వ్యాధుల నియంత్రణకు పశు వైద్య శిబిరాలు మేలు చేస్తాయని మండల పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వేల్పుచర్ల, సూరేపల్లి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 105 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసి, 985 దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ



ఆగిరిపల్లి: మండలంలోని సగ్గురులో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ చారిటబుల్ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం 65 మంది పేదలకు దుప్పట్లు, వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు కోట భాస్కరరావు, డెన్నీరాజ్, ఆదాం, రంగారావు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

ఆగిరిపల్లి: రీ సర్వేకు ప్రతి రైతూ సహకరించాలని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ కోరారు. మండలంలోని నరసింగపాలెంలో నిర్వహిస్తున్న రీ–సర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే చేసే ప్రాంతంలో ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, రీ–సర్వే డీటీ మరియన్న, ఆర్ఐ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: మండలంలోని రెండు గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మర్రిబంధం గ్రామానికి చెందిన రేగుల రమాదేవి వద్ద ఐదు లీటర్ల సారా, తుమ్మగూడెం గ్రామంలో అచ్చి మహేష్ వద్ద ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు.

సారా తయారీదారుల బైండోవర్

విస్సన్నపేట: మండలంలో సారా తయారు చేస్తున్న 13 మందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం విస్సన్నపేట తహసీల్దార్ లక్ష్మి కల్యాణి ఎదుట బైండోవర్ చేశారు. చంద్రుపట్ల తండా, కలగర తండాలలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న వారిపై పలుమార్లు కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వీరిని షరతులతో కూడిన వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్ తెలిపారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

పంచాయతీ రాజ్ డీఈఈ సరస్వతి

మైలవరం: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నందిగామ పంచాయతీ రాజ్ డీఈఈ సరస్వతి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామ రహదారుల్లో కూడా రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారులైతే సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఏఈఈ గిరిధర్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, వాహనాలు జాగ్రత్తగా నడపాలన్నారు. ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి విద్యార్థి తమ బాధ్యతలు తెలుసుకోవాలని, జీబ్రా క్రాసింగ్‌లో మాత్రమే రోడ్డు దాటాలని చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, మైలవరం పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు, పంచాయతీరాజ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారావు



ఫోన్లలో ఎన్ఎస్ఎస్ యాప్‌ను చూపుతున్న రైతులు, అధికారులు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): పంట పొలాలకు సేంద్రియ, జీవన ఎరువులు వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ యు.నరసింహారావు అన్నారు. మూలపాడు, త్రిలోచనాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వేసవిలో నవధాన్యాలు సాగు చేసే పొలంలో సజీవవేరు కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఎన్‌పీఎస్ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ స్కీమ్) యాప్‌పై అవగాహన కల్పించారు. రైతుల ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా ఒక్కొక్క గేదెకు రూ.40 వేల రుణం పొందే అవకాశం ఉందని పశువైద్యురాలు శైలు మాధురి చెప్పారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. ఏఓ శైలజ, వీఏఓ సాయి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

- తిరువూరురూరల్: కొమ్మిరెడ్డిపల్లి, ముష్టికుంట్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర డెప్యూటీ డైరెక్టర్ మాధవీలత వరిలో సమగ్ర పోషక యాజమాన్యం, సూక్ష్మపోషకాల ప్రాధాన్యం, సమగ్ర పోషక లోపాల సవరణ ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు సూటి ఎరువుల వాడకం పెంచి కాంప్లెక్సు ఎరువుల వాడకం తగ్గించాలని ఆమె సూచించారు. దూడల పోషణ, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, మినీ గోకులం షెడ్లపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు వివరించారు. పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ రమేష్, వ్యవసాయ సహాయ సంచాలకులు కెనడీ, మండల వ్యవసాయాధికారి పద్మ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



పరిటాలలో పంటలను పరిశీలిస్తున్న ఏడీ

కంచికచర్ల: రైతులు పంటలను రక్షించుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ మనీషా పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పత్తి పంటలో తెల్లదోమలు ఆశించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి పంటకు తెగులు ఆశించకుండా లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారుల సూచనల మేరకు నీలిమందులను పిచకారీ చేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పశువైద్యాధికారులు పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్ వీఏఏ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

210 మందికి వైద్య పరీక్షలు

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట మండలం పోచంపల్లి గ్రామ సచివాలయంలో పెనుగంచిప్రోలు మండలం కొణకంచి, జగ్గయ్యపేట మండలం వేదాద్రి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కె.వాణి, ఎన్.విష్ణువర్ధన్ 210 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఆయుర్వేద వైద్యం నయం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగా చేయటం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.